చలపతి ఓ స్కూలు బస్సుకు డ్రైవర్. ఇది నిన్నటి మాట. ఇప్పుడు ఆ స్కూలు బస్సుకు మాజీ డ్రైవర్ అయిపోయాడు. కారణం ఏమిటంటే నిన్నటి రోజు తాగకుండా స్కూలుకు వెళ్లాడు. అంతే... దానితో ఇదివరకు రోజూ తాగి వచ్చేవాడని ఆ స్కూలు యాజమాన్యం పసిగట్టి ఉద్యోగంలోంచి పీకి పారేసారు.

డ్రైవింగ్ తప్ప మరో పని తెలీని చలపతి డ్రైవర్‌గా ఉద్యోగం కోసం అందర్నీ అడిగి చూసాడు. కానీ తనకున్న 'గుడ్‌విల్' మూలంగా అందరూ సారీ అని చెప్పి పంపేసారు.

ఇలా ఉండగా కాలం తన క్యాలెండర్‌లో దాదాపు తొమ్మిది పేజీలు తిప్పేసింది. ఏ పని లేకుండా ఇంట్లోనే కూర్చుని ప్రతినెలా అప్పులు చేయడం, ఆ డబ్బుతో సంసారాన్ని ఈదడం... ఇదే చలపతి నెలచర్య అయిపోయింది.

చలపతి భార్య అందరి ఆడాళ్లు ఒకేలా ఉండరని నిరూపించింది.

"ఏమండీ! మీరు తాగుడు మానేయండి. నెల నెలా ఇలా అప్పులు చేసుకుంటూ తింటూ పోతే ఎలా? ఎక్కడికైనా వెళ్లి ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోండి" అని సతాయించే బాపతుకాదు. చలపతి ఇష్టమే తన ఇష్టంగా ఫీల్ అవుతూ భర్తంటే దేవుడితో సమానం అనే కాన్సెప్ట్‌తో కించిత్తు మాట కూడా నొప్పించే విధంగా మాట్లాడకుండా తన ప్రతిభను చాటుకుంటూ ఉంది.

వన్ ఫైన్ మార్నింగ్ చలపతికి ఎందుకో తను చేసిన అప్పులు గుర్తుకొచ్చి భయం చుట్టుకుంది. అవి తీర్చలేమోనన్న ఆందోళన అతన్ని ఆవహించింది. ఇక తను బతికి అప్పులోళ్ల దగ్గర అవమానంపాలు కాకూడదని నిర్ణయించుకుని అందరూ పిరికి చర్య అనే ఆత్మహత్యే ఉత్తమ మార్గంగా భావించాడు. అనుకున్నదే తడవుగా వెళ్లి తన కాలనీలో ఉన్న యమహా ఫెస్టిసైడ్స్ షాపులో ఎండ్రిన్ కొన్నాడు. ఇంటికొచ్చి తన చావుకు తనకున్న పాపిష్టి తాగుడు అలవాటుదే బాధ్యత అని సూసైడ్ నోట్ రాసి ఎండ్రిన్ అనే విష పదార్థాన్ని గుటగుట తాగేసాడు.

టీవీ సీరియల్ చుట్టానికి పక్కింట్లోకి వెళ్లిన చలపతి భార్య అప్పుడే ఇంట్లోకి రావడం, భర్తచేసిన దుశ్చర్యను చూడడం, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయడం, అదేదో చలపతి ఇంటి పక్కనే వున్నట్లు వెంటనే రావడం, వారు తీసుకెళ్లి ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్పించడం, కొత్త పేషెంట్ వచ్చినందుకు హాస్పిటల్‌వారు ఆనందించడం... ఇదంతా దాదాపు పావుగంటలో జరిగిపోయింది.

ఇక కార్పొరేట్ హాస్పిటల్‌వారు నైతిక విలువల్ని పక్కన పెట్టేసి అవసరం ఉన్నా లేకపోయినా ఆ టెస్టులు ఈ టెస్టులు ఎడాపెడా చేసేసారు. ఒకవేళ పేషెంట్ చనిపోతే తమ బిల్లు రాబట్టుకోవడం కష్టం అనుకున్నారేమో మొత్తానికి చలపతి యముడి దగ్గరకు వెళ్లనివ్వకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

ఆ రోజు న్యూస్ ఛానెల్ వాళ్లకు టీఆర్‌పి రేటింగ్‌కు పనికొచ్చే ఏ న్యూస్ లేకపోవడంతో చలపతి ఆత్మహత్య ప్రయత్నాన్ని రోజంతా టెలికాస్ట్ చేసి ఊదరగొట్టేసారు. దాంతో చలపతి భార్య ఎవర్ని అడిగినా అందరూ అప్పులు




ఇచ్చారు. చలపతి బాల్చీ తన్నేస్తే ఇదివరకే తాము ఇచ్చిన అప్పులు అనంత వాయువుల్లో కల్సిపోతాయేమోనని పాత బాకీదారులు మరి కొంత అప్పు ఇచ్చి తమ ఉదారతను చాటుకున్నారు. ఇందుమూలంగా చలపతి ట్రీట్‌మెంట్‌కు కావాల్సిన డబ్బులు సునాయాసంగా సమకూరాయి.

"వెధవ డబ్బుదేముంది? నా భర్త బతికాడు. అదే లక్ష మిలియన్ల డాలర్లు" అనుకుని కార్పొరేట్ హాస్పిటల్‌వారి బిల్లు కూడా బేరం చేయకుండా అంతా కట్టేసి యమధర్మరాజు నుండి తన పతిని తిరిగి తెచ్చుకున్న మహాసాధ్వి సతీ సావిత్రిలాగా చలపతి భార్య తన భర్తను కార్పొరేట్ హాస్పిటల్ నుండి ప్రాణాలతో ఇంటికి తెచ్చుకుంది.

చలపతి ఆత్మహత్యకు పాల్పడడానికి కారణం తాను చేసిన లక్ష రూపాయల అప్పు. కానీ తాను చేసిన ఆత్మహత్యా ప్రయత్నం నుండి కాపాడినందుకు కార్పొరేట్ హాస్పిటల్‌వారికి బిల్లు పే చేసేందుకు చేసిన కొత్త అప్పు అక్షరాలా లక్షన్నర.

అంటే చలపతి తీర్చాల్సిన అప్పు కొత్త పాత కలిపి రెండు లక్షల యాభైవేలు.

చలపతి పరిస్థితి చూస్తే కొండ నాలుక్కి మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న సామెత అయింది. కొత్త అప్పు సంగతి తెలిస్తే మళ్లీ కథ మొదటికి వస్తుందని పాపం ఆ ఇల్లాలు నిజాన్ని దాచిపెట్టి భర్తను దక్కించుకుంది. చలపతి లాంటి అప్పుల అప్పారావులవల్ల మనకు తెలిసే నీతి ఏమిటంటే అప్పులు తిప్పలు పెట్టి అప్పును పెంచును.

★